"యువర్ అటెన్షన్ ప్లీజ్.... అందరూ వినండి" భద్రాద్రి చేతులు పైకెత్తి అరచిన అరుపులకు అందరము విశ్రద్ధంగా అయ్యాము.

"రేయ్....మూడురోజుల్రకితం ఢిల్లీలో పట్టపగల్లా బాంకు వగులగొట్టి ముప్పై లక్షలు దోచుకుపోయారు. దారిలో మూడు కారులు మార్చారు. ఇప్పటికీ అయిడెంటిఫికేషను దొరకలేద్రా...."

"ఎట్లా జరిగింది భద్రాద్రీ" అడిగాడు మామూ.

"ఏముందిరా! ముందు వాచ్ మన్ ని కాల్చేశార్రా...తరువాత లోపలికివెళ్ళి కాషియర్‌కు కత్తిచూపించి మొత్తం దోచుకొన్నారు. మరో విషయంరో!....పట్టిచ్చిన వాళ్ళకు పాతికవేల రూపాయల బహుమతి ఇస్తార్ట్రో...." అతనికళ్ళు ఆశ్చర్యంతో మెరుస్తున్నాయి.

"నెక్ట్స్...." అన్నాడు బాషా.

"పారిస్‌లో ఒకచోట రోయ్....డెబ్భై ఏళ్ళ ముసలోడు పద్నాలుగేళ్ళ మనవరాల్ని రేప్ చేశాడురా....వాడికెలాంటి శిక్ష వేస్తారో. రోజులు చూడ్రా ఎలా వున్నాయో!...." అతనిగొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

"ఇది వినండి.... చీరాల్లో కోతి భలే అల్లరిచేస్తోందట్రా! పట్టిచ్చినవాడికి వెయ్యి రూపాయలు బహుమతి...." కోతిలాగ ఎగిరాడు భద్రాద్రి.

"భద్రాద్రీ! టైము అయిదు నిమిషాలే వుంది. వార్తలు త్వరగా చెప్పెయ్. ఆఫీసరు వచ్చేటయిమయింది...."

భద్రాద్రి మళ్ళీ అందుకున్నాడు.... "ఏముందిరా! రాజకీయాలు నిలకడ లేకపోయాయి. చీఫ్ మినిస్టరు రేపు మినిస్టర్ల పోర్టుఫోలియోలు మారుస్తాడట. ఎవరు ఏ పోర్టుఫోలియో అయింది రేపు చెబుతాన్రా! న్యూస్ ఓవర్...ఎవర్రా టీ ఇప్పించేది?.."

నేను లేచాను. నా వెంట భద్రాద్రి బయలుదేరాడు.

భద్రాద్రి వయస్సు యాభై మూడేళ్ళు. అతని వయసును బట్టి అతను ఎవర్ని "ఒరే" అన్నా ఎవరం పట్టించుకోం. గుమస్తాగా వుద్యోగంలో చేరాడు. గుమస్తాగానే రిటయిరవబోతున్నాడు.

వస్తువుల ధరలు బుసకొట్టే త్రాచుపాముల్లా వున్న ఈ రోజుల్లో గుమాస్తాకు ఓ న్యూస్ పేపరు ఇంటికి తెప్పించుకోవాలంటే అలివయ్యే పనికాదు. ఆఫీసుకో ఇంగ్లీషు డెయిలీ వస్తుంది. అది ఆఫీసరు గారి టేబుల్ మీదికిపోతుంది గనక ఎవరం చొరవ తీసుకోము. ఆ పరిస్థితుల్లో మా ఆఫీసుకు పర్మనెంటు అర్టిష్టయిన భద్రాద్రి ఉదయాన్నే నిద్రలేచి సెంటరుకు వెళ్ళి అన్ని ఇంగ్లీషు, తెలుగు పత్రికలు అరువు చదివి (ఉచితంగా) వస్తుంటాడు.

ఆఫీసు పదిన్నరకనగా ఓ అరగంట ముందుగా వచ్చి వార్తలు చదువుతాడు.




ఆ సమయానికి మేమంతా చేరుకొని ఉంటాము. మొదట్లో మర్యాదకు మేము కాఫీకి పిలిచేవాళ్ళం. కాని ఇప్పుడతనే అడుగుతున్నాడు.

* * *

అన్నిరోజుల్లాగే ఆ రోజూనూ సూర్యుడు నడ్డిమీద మోస్తున్నాడు ఉదయం పదింబావయింది. చిన్నగా వర్షపు తుంపరలు పడుతున్నాయి. భద్రాద్రి ఇంకా రానందుకు విసుగ్గా వుంది.ఇంతలో "యువర్ అటెన్షన ప్లీజ్....అందరూ వినండి" తన మామూలు ఫక్కీలో చెప్పడం మొదలుపెట్టాడు.

"ఈ రోజు వార్తలు చెప్పుకోదగ్గవేం లేవు....విజయవాడలో రెండువందల గుడిసెలు తగలబడిపోయాయి. ఎవడో వెధవ సిగరెట్ త్రాగి వేశాడట .... రేయ్ ఇది వినండిరా ఎంత తమాషాగావుందో. ఒక తాత, మనవడి మూడో పుట్టిన రోజున ఎక్కడో అప్పుచేసి మూడువేలు తెచ్చి ఓ బంగారు చైను, వాచి, ఉంగరం చేయించాడురా....ఆ రాత్రి తనప్రక్కనే పడుకోబెట్టుకొన్నాడు మనవడ్ని. అంతే. తెల్లవారే సరికి మనవడు ప్రక్కన లేడు .... తెల్లవారి వెతికినా ప్రయోజనం లేకపోయింది."

"అయ్యయ్యో" అన్నాం అందరం విచారంగా.

"అయితే ఒక విచిత్రం జరిగింది. పోలీసు రిపోర్టు ఇవ్వాలని వాళ్ళు అనుకొంటూండగా పిల్లవాడు ఏడుస్తూ వీధిలోంచి వచ్చాడు...."

"నగలున్నాయా...." ఆత్రుతగా అడిగాడు వేమరాజు.

"ఇంకెక్కడుంటాయిరా నగలు.... ఆ ముసలోడికి ఒక వైపు బిడ్డ తిరిగి వచ్చినందుకు సంతోషంగా వున్నా.... మూడు వేలు ఏట్లో పోయాల్సొచ్చినందుకు తలచుకొని తలచుకొని ఏడ్చాడు".... భద్రాద్రి గుండెల్లోంచి ఏడుపు తన్నుకొచ్చింది. అదే మాకు నచ్చని విషయం. ఎవరికేం జరిగినా తనకే జరిగినట్లు అందులో లీనమయిపోయి తనూ బాధపడతాడు

"భద్రాద్రీ.... మరేం బాధపడకు.... కాఫీకి వెళ్దాంరా!" పిలిచాడు బాషా.

"బాధపడక ఏం చేసేదిరా.... ఆ ముసలాడ్ని నేనే. నా మనవడి నగలే దొంగలెత్తుకుపోయారు" ముఖం అరచేతుల్లో పెట్టుకొని దుఃఖిస్తున్నాడు. మా అందరి గుండెలు భారమయ్యాయి. ఈ షాకునుంచి ఎలా తేరుకుంటాడో అనుకొన్నాము.

* * *

కాని మేం ఊహించని విధంగా మరురోజు పదిగంటలకు "యువర్ అటెన్షన్ ప్లీజ్.... అందరూ వినండి ఈ రోజు వార్తలు...." గుండెలోని బాధను అదిమిపెట్టి, చేతులు పైకెత్తి చెప్పడం మొదలుపెట్టాడు భద్రాద్రి.

—పి. సుబ్రహ్మణ్యం